వసతులు లేక వెతలు

ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో వేధిస్తున్న సమస్యలు

కాలేజీ విద్య పేద విద్యార్థులకు గగనమవుతోంది. దీంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కార్మిక వాడలు, బస్తీలు, పట్టణాలు, గ్రామాల్లో నివసించే నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేక ..హైస్కూల్, ఇంటర్ విద్యతోనే స్వస్తి చెప్పాల్సిన వస్తోంది. ప్రతి ఏటా జిల్లాలో 108 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 8 వేల మంది విద్యార్థులు పదోతరగతి పూర్తి చేసి.. ఇంటర్ చదువుకు వెళ్లాల్సి ఉండగా, సరిపడు ప్రభుత్వ ఇంటర్ కాలేజీలు లేకపోవటంతో సగం మంది విద్యార్థులు హైస్కూల్ చదువులతోనే ముగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇంటర్ పూర్తి చేసుకున్న కొద్ది మంది విద్యార్థులు కూడా .. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు లేక పోవటంతో ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

- హైస్కూల్, ఇంటర్ కాలేజీల్లో షిఫ్టు సిస్టమ్‌లో డిగ్రీ కాలేజీల మనుగడ
- బోధన, బోధనేతర సిబ్బంది కొరత
- మంచినీటి, మరుగు దొడ్ల పరిస్థితి మంరింత అధ్వానం





మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నాలుగు ప్రభుత్వ ఇంటర్ కాలేజీలు ,రెండు ఎయిడెడ్ కాలేజీలు ఉన్నాయి. ఇందులో 2,640 మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాగే జిల్లాలోని 228 ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్ కళాశాలల్లో 1.13 లక్షల మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. జిల్లాలో మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్‌లో చాలీచాలని భవనాల్లో అరకొర సౌకర్యాల నడుమ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. బొల్లారం, అల్వాల్‌లో ప్రభుత్వ ఎయిడెడ్ కాలేజీలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ కాలేజీలలో వసతుల పరిస్థితి కూడా అంతంత మాత్రమేనని చెప్పవచ్చు.

15 మండలాలకు 4 మండలాల్లో ఇంటర్ కాలేజీలు

జిల్లాలో 15 మండలాలు ఉన్నాయి. 11 మండలాల పరిధిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు లేక పోటంతో స్థానిక విద్యార్థులకు ఇబ్బందులు తప్పటం లేదు. శామీర్‌పేట, కీసర , ఘట్కేసర్, మేడిపల్లి, మూడు చింతలపల్లి, ఉప్పల్, కాప్రా, బాచుపల్లి, దుండిగల్, అల్వాల్, బాలానగర్ మండలాల పరిధిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీంతో విద్యార్థులు పక్క మండలాల పరిధిలోని ప్రభుత్వ కాలేజీల్లో చదువుకోవటమో ..లేక ప్రైవేట్ కాలేజీలను ఆశ్రయించటమో చేయాల్సి వస్తోంది. దీంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది.

ఇంటర్ కాలేజీల్లోనే... డిగ్రీ చదువులు

జిల్లాలో నాలుగు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనే ..షిఫ్ట్ సిస్టమ్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలను కొనసాగుతున్నాయి. చాలీ చాలని వసతుల మధ్య విద్యార్థులు తమ చదువులను నెట్టుకురావాల్సి వస్తోంది. జిల్లాలో ఐదు డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. ఉప్పల్‌లోని డిగ్రీ కాలేజీ స్థానిక ప్రభుత్వ హైస్కూల్ భవనంలో కొనసాగుతోంది. మల్కాజిగిరి డిగ్రీ కాలేజీ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం షిఫ్టు పద్ధతిలో తరగతులను నిర్వహిస్తున్నారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్‌లోని డిగ్రీ కాలేజీలు కూడా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నం వేళ షిఫ్టు సిస్టమ్‌లో కొనసాగుతున్నాయి. ఈ నాలుగు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో మొత్తంగా 1040 మంది విద్యార్థులు చదువుతున్నారు. దీంతో జిల్లాలో ఇంటర్ పూర్తి చేసిన నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ప్రవేశం లభించకపోవటంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి అప్పోసప్పో చేసి ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో చదుకోవాల్సిన వస్తోంది. మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలని దశాబ్ద కాలం నుంచి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తున్నారు. అయినా మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి మోక్షం కలుగలేదు.

సమస్యల నడుమ సదువులు

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పలు సబ్జెక్టులకు సంబంధించిన అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంటర్‌లో కాంట్రాక్టు లెక్చర్లతో విద్యా సంవత్సరాన్ని నెట్టుకొస్తున్నారు. విద్యార్థులకు కాలేజీల్లో కనీస వసతులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. మంచినీటి కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలల పరిస్థితి మరి అధ్వానంగా ఉంది. గంటల తరబడి వేచి ఉంటే తప్ప ..బాత్ రూమ్‌లకు వెళ్లలేని పరిస్థితి ఉంది. అధ్యాపకులకు కూడా ఈ ఇబ్బందుల నుంచి మినహాయింపు లేదని చెప్పవచ్చు. విద్యుత్ సదుపాయం కూడా సరిగ్గా లేదు. బోధనేతర సిబ్బందిని నియమించకపోవడంతో అక్కడ ఉన్న అధ్యాపకులే అన్ని విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలను పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ అధికారులకు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై చూపిస్తున్న మోజును ప్రభుత్వ కాలేజీలపై చూపకపోవడంతో విద్యార్థులు సకల సమస్యలతో చదువులు కొనసాగించాల్సి వస్తోందని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి.

ప్రభుత్వ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. మరుగుదొడ్లు, మూత్రశాలల సరిపడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలి. మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీతోపాటు జూనియర్ కాలేజీలు లేని 11 మండలాల్లో ప్రభుత్వ కాలేజీలను ఏర్పాటు చేయాలి. సమస్యల పరిష్కారానికి పోరాటాలను తీవ్రతరం చేస్తాం.

– రాథోడ్ సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

5న చలో ఇందిరాపార్కు



సమావేశంలో పాల్గొన్న నాయీ బ్రాహ్మణులు

మోతీనగర్: కార్పొరేట్ సంస్థల రాకతో తమ ఉపాధి దెబ్బతిందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహ నాయీ అన్నారు. మంగళవారం మోతీనగర్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గ సమావేశం అవంతినగర్ తోట కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ డిమాండ్లతో నవంబర్ 5న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించారు. తమ కుల వృత్తిని ఇతర కులాల వారు చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, సిరిసిల్ల శ్రీనివాస్, ధర్మం , కనకయ్య, బాలకృష్ణ, భాస్కర్, వి. గోపి నాయి, దశరథ్ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ప్రొఫెసర్ వసుమతి, శివకుమార్

కేపీహెచ్‌బీకాలనీ: ఆస్క్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు, జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ వసుమతి, శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం శివానంద రిహాబిలిటేషన్ సెంటర్‌లో అన్నదానం నిర్వహించారు. వారి చిన్న కుమారుడు రోషన్ బాబు పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఎరవెల్లి జగన్, భానుప్రకాష్, హేమంత్, రూప్‌సింగ్, దేవి తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి కాయల విక్రయానికి 2న బహిరంగ వేలం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానం (పాత శివాలయం)లో కొబ్బరికాయలు, పూలు, పూజ సామగ్రి అమ్ముకునేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2న ఉదయం 10:30 గంటలకు బహిరంగ వేలం దేవాలయ ప్రాంగణంలో జరుగునని తెలిపారు. కాల పరిమితి నవంబర్ 11 నుంచి 18 నవంబర్ 2025 వరకు ఉంటుందని తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ సఫ్దార్ నగర్ సీ బ్లాక్‌లో రూ.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ సబిహా బేగం డీఈ శ్రీదేవి, ఏఈ రంజిత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో డివిజన్ పరిధిలోని అన్ని బస్తీల్లో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నామని వివరించారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వినాయక్‌రావు, అబ్దుల్ హమీద్ పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి ఆలయ వేడుకలు



అన్నదానంలో పాల్గొన్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ గంగపుత్ర సంఘంలోని మహంకాళి దేవాలయ 24వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి మంగళవారం పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి హోమాలు, పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, దానయ్య, రాజు, సత్యనారాయణ, శ్రీరాములు, శివ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పరామర్శ

ఓల్డ్‌బోయిన్‌పల్లి: సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద జరిగిన లాఠీ చార్జీలో తీవ్రంగా గాయపడిన సాయికుమార్‌ను కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మన్నె ఉదయ్‌యాదవ్, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు

- చేసే పద్ధతికి మాత్రమే వ్యతిరేకం
- మూసీని శుద్ధి చేయాల్సిందే..
- ఎంపీ ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

మూసాపేట: మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదని, చేస్తున్న పద్ధతికి మాత్రమే వ్యతిరేకమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ పార్కులో మంగళవారం బ్రేక్ ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో ఉన్నప్పుడు తప్ప ఇక్కడ ఉన్న ప్రతి రోజూ నియోజకవర్గంలోనే పర్యటిస్తున్నానని తెలిపారు. అభివృద్ధి పనుల కోసం అధికారులను కలిసినప్పుడు నిధులు లేవని సమాధానం చెబుతున్నారని తెలిపారు. కేంద్రంలో అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రిని కూడా కలిసి స్వచ్ఛభారత్, స్మార్ట్ సిటీ కింద నిధులు ఇవ్వాలని కోరినట్లు గుర్తు చేశారు. చెరువుల్లోకి మురుగు నీటిని పోకుండా దారి మళ్లించేందుకు గతంలో స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ తీసుకువచ్చిందన్నారు. దానికి కొన్ని నిధులు కేటాయించాలని కోరానన్నారు. హైడ్రా ఉద్దేశం వేరే ఉందని నేను చెప్పిన మాటలు ఇప్పటికీ ప్రజలు నమ్ముతున్నారన్నారు. రసాయన వ్యర్థాలను శుద్ధి చేస్తేనే మూసీ బాగుపడుతుందన్నారు. సీనియర్ నాయకులు రామ్మోహన్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేందర్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, బూరుగుపల్లి రామ్మోహన్, కృష్ణ గౌడ్, నాగిరెడ్డి, బిక్షపతి, ఐలన్న, విజయ్ కుమార్, కృష్ణయ్య, వేణు, శ్రీనివాసరెడ్డి, మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.

నీరు సాఫీగా వెళ్లేలా పూడికతీత



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: బోయిన్ చెరువు దగ్గర నీరు సాఫీగా వెళ్లేలా నాలా పూడికతీత పనులు కొనసాగుతున్నాయని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. మంగళవారం అధికారులతో కలిసి పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోయిన్ చెరువును మరింత అభివృద్ధి చేసేందుకు తగిన కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మన్నె ఉదయ్‌కుమార్ యాదవ్, ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని దత్తాత్రేయ నగర్ కాలనీలో రూ.17 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, జగదీష్, నాగభూషణం, మల్లేష్, సంతోష్ బిరాదర్, నాగేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

దుకాణదారులు అనుమతి తీసుకోవాలి : ఏసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసరావు

మూసాపేట: బాణాసంచా దుకాణదారులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, లేకుంటే సీజ్ చేస్తామని ఏసీపీ శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎస్ఆర్ గార్డెన్స్‌లో క్రాకర్స్ షాపుల యజమానులు, డీలర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలం, గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తే మున్సిపల్ నుంచి ఎన్‌ఓసీ, ప్రైవేట్ స్థలం అయితే భూ యజమానితో ఎన్‌ఓసీ తీసుకోవాలన్నారు. మీ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. షాపుల ముందు నీటి డ్రమ్ములు ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో ఎవరైనా షాపులో ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే 100కు ఫోన్ చేస్తే వెంటనే పోలీసులు స్పందిస్తారన్నారు. సమావేశంలో కూకట్‌పల్లి సీఐ ముత్తు, అల్లాపూర్ సీఐ వెంకట్‌రెడ్డి, కేపీహెచ్‌బీ సీఐ వెంకటేశ్వర్లు, బాచుపల్లి సీఐ ఉపేందర్, ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మోతీనగర్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీలిమ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి. శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మూసాపేట డివిజన్ పాండురంగ నగర్ మినీ ఫంక్షన్ హాల్‌లో పాండురంగ నగర్ సంక్షేమ సంఘం, నీలిమ ఆసుపత్రి సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహిళల కోసం డాక్టర్ వై. అనూపమ పర్యవేక్షణలో స్త్రీ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులకు డాక్టర్ జి. సంతోష్‌కుమార్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. త్వరలో ప్రతి కాలనీలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీతేజ, సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, నాయకులు రమేష్ నాయర్ పాల్గొన్నారు.

గుర్తింపు లేని కళాశాలపై కేసు నమోదు

మూసాపేట: గుర్తింపు లేని కళాశాల నడుపుతూ విద్యార్థులకు మాయమాటలు చెప్పి చేర్చుకోవడంతో విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కేపీహెచ్‌బీ కాలనీలోని అమ్రిత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ మెడికల్ సైన్స్ కళాశాలలో పారా మెడికల్ కోర్సులో చేర్చుకున్నారు. కళాశాలకు గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అక్రమ నిర్మాణాల జోరు



అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. అనుమతులకు మించి అంతస్తులు నిర్మిస్తున్నారు. వినాయకనగర్, రాజు కాలనీల్లో ఇంత జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ఓ యువతి నుంచి ఫిర్యాదుల రావడంతో.. కేవలం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. రాజు కాలనీలో నిర్మించే ఓ భవన నిర్మాణదారుడికి అధికారుల అండదండలు ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. ఈ విషయమై టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్‌కు ఫోన్‌చేయగా అందుబాటులోకి రాలేదు. ఇకనైనా అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మూసాపేట మెట్రో స్టేషన్‌లో ‘ఫ్రీడమ్’ బ్రాండింగ్ ఆవిష్కరణ



సాక్షి,సిటీబ్యూరో : ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ మూసాపేట్ మెట్రోస్టేషన్ వద్ద తమ బ్రాండింగ్‌ను ఆవిష్కరించింది. వేలాది ప్రయాణికులతో రద్దీగా ఉండే మూసాపేట్ మెట్రో స్టేషన్‌లో రైస్‌బ్రాన్, సన్‌ఫ్లవర్, ఆవాలు, వేరుశనగ నూనెలతో సహా అధిక నాణ్యత కలిగిన నూనెల శ్రేణిని ప్రదర్శించేందుకు ఫ్రీడమ్‌కు ఇది సరైన వేదిక అని ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి. చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మూసాపేట్ మెట్రో స్టేషన్‌తో భాగస్వామ్యం ద్వారా ప్రజల రోజువారీ ప్రయాణంలో భాగం కావడం తమకు ఎంతో సంతోషం కలిగిస్తోందన్నారు. పోషకాలతో సమృద్ధిగా ఉండటంతో పాటు గుండె ఆరోగ్యానికి తోడ్పడే నూనెలను అందించడం ద్వారా ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రేరేపించాలనే తమ మిషన్ లక్ష్యం ఈ కార్యక్రమం ద్వారా ప్రతిబింబిస్తోందన్నారు.

రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌దే అధికారం

- ఇప్పటికే కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుగెత్తారు
- కేసీఆర్ చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకుంటున్నారు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ తదితరులు

కూకట్‌పల్లి: కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని, రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కూకట్‌పల్లి డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 సంవత్సరాల కాలంలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలు మర్చిపోలేదని, వేల కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకున్నామని గుర్తు చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు వెళదామన్నారు. ఎక్కడ ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని, వారికి ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, జనరల్ సెక్రెటరీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



కూకట్‌పల్లి, ఏవీబీ పురానికి చెందిన పి అక్షేశ్వరికి రూ.75 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావు బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

స్పందించారు.. మరమ్మతులు చేశారు



మరమ్మతులకు ముందు



తరువాత

సాక్షి ఎఫెక్ట్..

బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని శ్రీహరినగర్‌లో రెండు రోడ్ల మధ్యలో ఉన్న గుంతకు మంగళవారం అధికారులు మరమ్మతులు చేశారు. ఈ నెల 19న ‘సాక్షి’ దినపత్రికలో ‘మరమ్మతులు చేపట్టరా?’ అని ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. – మూసాపేట



ఎల్లమ్మతల్లి ఆలయంలో నిర్వహించిన పూజలో పాల్గొన్న టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, సుంకన్న, తదితరులు

– మూసాపేట